సాక్షి మెదక్

సోమవారం ၊ 29 ၊ ఏప్రిల్ ၊ 2024



రాజ్యాంగంపై దుష్ప్రచారం

రాజ్యాంగాన్ని మారుస్తారంటూ బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని రఘునందన్‌రావు మండిపడ్డారు.

వివరాలు 8లో ▸



యువ కవుల జోష్..

కవులు, కళాకారులు, సాహితీవేత్తలతో ఆధ్యాత్మికం, సాహిత్య పరంగా సిద్దిపేట ముందుకెళ్తుంది.

వివరాలు 8లో ▸



ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు

పుట్టుకతో మూగ, చెవిటి ఉన్నప్పటికీ నిరాశ చెందకుండా చిత్రలేఖనంలో ఔరా అనిపిస్తున్నాడు మదన్‌కుమార్.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఓటమి భయంతోనే ఆరోపణలు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

అల్లాదుర్గం(మెదక్): ఓటమి భయంతోనే సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అల్లాదుర్గంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే దేశంలో రిజర్వేషన్లు ఎత్తివేస్తారని ఆరోపించడం సరికాదన్నారు. ఈనెల 30న జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అల్లాదుర్గంలో ప్రధాని నరేంద్రమోదీ జనసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు రాదని, కాంగ్రెస్ మూడు సీట్లకే పరిమితమవుతుందని చెప్పారు. అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని దేశంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఎన్‌డీఏ కూటమి 400 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. నరేంద్రమోదీ సభకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవసందేశం ఇచ్చారు. కాగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారికి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్ విజయం ఖాయం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు విజయం ఖాయమని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హర్షవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా యువ న్యాయ్ కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నీలం మధు విజయం కోసం ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభులింగం, నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎంజేపీ కన్వీనర్ రజిని

మెదక్ కలెక్టరేట్: మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1,973 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, వీరి కోసం జిల్లావ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు 1,973 మందికిగానూ 1,774 మంది హాజరు కాగా మరో 199 మంది గైర్హాజరైనట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ రజిని తెలిపారు.

పట్నం వేసి.. మొక్కు తీర్చి



రాజగోపురం ఎదుట భక్తుల కోలాహలం



పట్నాలు వేస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. అభిషేకాలు, పట్నాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, గంగరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది స్వామి వారి నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ, సిబ్బంది పర్యవేక్షించారు.

వర్గల్ క్షేత్రం.. వాగ్దేవి వైభవం



చిన్నారుల అక్షరస్వీకారాల సందడి



అమ్మవారి దివ్య మంగళరూపం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యాసరస్వతీ క్షేత్రం ఆదివారం మూల మహోత్సవ వేడుకలతో అలరారింది. ఓ వైపు భక్తజన సామూహిక లక్ష పుష్పార్చన, మరోవైపు చిన్నారుల అక్షరస్వీకార పూజలతో క్షేత్రం శోభిల్లింది. మండు వేసవి లెక్క చేయకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. క్షేత్రంలో 300 మంది పైగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయని మేనేజర్ రఘుపవన్ తెలిపారు.

దుర్గమ్మ సన్నిధి.. భక్తుల పెన్నిధి



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

పాపన్నపేట (మెదక్): తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఎల్లలు దాటి తరలివచ్చిన భక్తులు మంజీర పాయల్లో స్నానాలు చేసి దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి అర్చన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

క్వింటాలుకు 5 కిలోలు!

కొనుగోలు కేంద్రాల్లో నిలువు దోపిడీ

ప్రకృతికి ఎదురొడ్డి.. చీడపీడల నుంచి కాపాడుకుని.. అకాల వర్షాలను కాచుకుని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని చేరిస్తే చివరికి రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. నిర్వాహకులు క్వింటాలుపై ఏకంగా 5 కిలోల ధాన్యం అధికంగా తూకం వేస్తున్నారు. రైతులు ధాన్యాన్ని క్లీన్ చేసేందుకు నిరాకరించడంతో దీనిని ఆసరాగా చేసుకొని ఒక్కో బస్తాకు 42.300 గ్రాముల చొప్పున భర్తీ పెడుతున్నారు. ఈలెక్కన క్వింటాల్‌కు సుమారు 5 కిలోలకు పైగా అదనంగా తూకం వేస్తున్నారు. –మెదక్‌జోన్



లారీలో ధాన్యం బస్తాలను లోడ్ చేస్తున్న హమాలీలు

జిల్లాలో యాసంగి సీజన్‌లో 2.63 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా 4.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం 410 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఇప్పటివరకు 47 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇంకా 1.50 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ లెక్కన సగానికి సగం దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఎండల తీవ్రతకు బోరుబావులు వట్టిపోవడంతో పాటు రైతుల నుంచి వ్యాపారులు, మిల్లర్లు సన్నాలతో పాటు దొడ్డు ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నారు. కాగా కొనుగోలు కేంద్రాల్లో ముందుగా రైతులు ధాన్యాన్ని ప్యాడీ క్లీనర్లపై శుభ్రం చేసి 40 కిలోల బస్తాకు 41 కిలో చొప్పున భర్తీ పెట్టారు. దీంతో క్వింటాల్‌కు కేవలం 2 కిలోల చొప్పున అదనంగా ఖాళీ బస్తాల బరువును మాత్రమే తీసేశారు. కొనుగోళ్లు ప్రారంభమైన 15 రోజుల తర్వాత జిల్లాలోని కొన్ని కేంద్రాల్లో 40 కిలోల బస్తాకు 42.250 గ్రాముల చొప్పున భర్తీ పెడుతున్నారు. ఈ లెక్కన క్వింటాల్ ధాన్యానికి 5 కిలోలకు పైగా రైతు నష్టపోతున్నాడు. అయినప్పటికీ రైతులు ప్యాడీ క్లీనర్లపై ధాన్యం పోసి శుభ్రం చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైస్‌మిల్లర్లు లాభం పొందుతున్నారు.

రైతులు ముందుకు రావడం లేదు

నిబంధనల ప్రకారం ధాన్యాన్ని క్లీన్ చేశాకే తూకం వేయాలి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలకు 470 ప్యాడీ క్లీనర్లను అందజేశాం. మొదట్లో క్లీన్ చేసిన రైతులు ఆతర్వాత ముందుకు రాలేదు. 40 కిలోల బస్తాకు 42.200 కిలోల చొప్పున తూకం వేస్తుంది నిజమే.

– హరికృష్ణ, డీఎం సివిల్ సప్లై

మోసాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి



చిన్నశంకరంపేట: మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మ

మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నశంకరంపేట(మెదక్)/వెల్దుర్తి(తూప్రాన్): బాండ్ పేపర్లు రాసిచ్చి ఓట్లు పొంది ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికలో బుద్ధి చెప్పి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలను కోరారు. ఆదివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఉద్దెర మాటలు తప్ప ప్రజలకు చేసిందేమిలేదన్నారు. నాలుగు నెలల్లో మహిళలకు రూ. పదివేలు బకాయిపడిన కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి మంచి వ్యక్తి అయితే దుబ్బాకలోనే గెలిచేవారని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరలు పెరిగాయి తప్ప ప్రజలకు మేలు జరగలేదన్నారు. అనంతరం అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసేవ కోసమే కలెక్టర్ ఉద్యోగం వదిలివచ్చానని, ఎంపీగా గెలిచిన వెంటనే రూ.100 కోట్లతో ట్రస్టు పెట్టి ప్రజలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, నాయకులు ఏకే గంగాధర్‌రావు, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాధవిరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. అనంతరం వెల్దుర్తిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. మెదక్‌లో వెంకట్రామిరెడ్డి లక్ష మెజారిటీతో గెలుపొందడం తథ్యమన్నారు. తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో మెదక్ గళం వినిపించి ఈ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని వెంకట్రామిరెడ్డి అన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉమ్మడి వెల్దుర్తి మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనస్ ఇవ్వకుండా ముఖం చాటేశారు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులకు బోనస్ ఇస్తానని ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖం చాటేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదివారం రాత్రి మండల కేంద్రమైన శివ్వంపేటలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. కనీసం రైతులు పండించిన ధాన్యం కొనలేని స్థితిలో ఉందన్నారు. తరుగు పేరిట బస్తాకు 6 కిలోలు కోత విధిస్తూ మోసం చేస్తున్నారన్నారు. పదేళ్ల కాలంలో బీజేపీ తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ మహేష్‌గుప్తా, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్‌ఎస్ నాయకులు గోపి, చంద్రగౌడ్, రమాకాంత్‌రెడ్డి, యాదగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

జిల్లా ఎన్నికల పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్కోటి




మాట్లాడుతున్న సమీర్ మాధవ్ కుర్కోటి

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల విధుల్లో అధికారులు ఎట్టి పరిస్థితుల్లో అలసత్వం వహించొద్దని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు సమీర్ మాధవ్ కుర్కోటి ఆదేశించారు. ఆదివారం మెదక్ ఐడీఓసీలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈసీఐ పరిధిలో పనిచేయాలని సూచించారు. ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పు అందేలా ఖచ్చితమైన కార్యాచరణను అమలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహణ ఏర్పాటు పూర్తిచేయాలని తెలిపారు. జిల్లా వ్యయ పరిశీలకుడు సునీల్ కుమార్ రాజ్వాన్షి మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి అనుమతితోనే ప్రచార సామగ్రి రవాణా చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థి ఖర్చు నమోదు చేయడంతో పాటు వీడియో రికార్డ్ చేయాలని సూచించారు. పోలీస్ పరిశీలకుడు రామేశ్వర్ సింగ్ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత పెంచాలని చెప్పారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ బాలస్వామి పరిశీలకులకు ఎన్నికల ఏర్పాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో సిద్దిపేట ఎస్పీ అనురాధ, సంగారెడ్డి ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, గరిమా అగర్వాల్ ఎన్నికల నోడల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వేదపాఠశాలలో పరీక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలోని వేద పాఠశాల విద్యార్థులకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. టీటీడీ కల్యాణమండపంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆగమ సలహాదారు డాక్టర్ మహంతయ్య ఆధ్వర్యంలో పరీక్షలు కొనసాగాయి. 52 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగ ఆలయ ఈవో బాలాజీ, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పర్యవేక్షించారు.

నిరక్షరాస్యుల్లో.. అక్షర కాంతులు



వయోజనులకు మేలు

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవభారత్ సాక్షరత కార్యక్రమం ద్వారా వయోజనులకు ఎంతో మేలు జరుగుతుంది. వారిని అక్షరాస్యులను తీర్చిదిద్దడమే కాకుండా వారికి జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. గ్రామాలలో ఉండే ఉపాధ్యాయులు, ఉన్నత విద్యావంతుల సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగనుంది. ముందుగా ఎక్కువ నిరక్షరాస్యులు ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

– రామేశ్వరరావు, సాక్షరభారత్ డిప్యూటీ డైరెక్టర్

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలోని ప్రతీఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా నవభారత సాక్షరత (ఎన్ఐఎల్పీ– న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వయోజనులందరికీ చదవడం, రాయడం రావాలనే ఉద్దేశంతో ఎన్ఐఎల్పీ పేరుతో నూతన పథకాన్ని ప్రారంభించింది. సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా చేపట్టిన సాక్షరభారత్ కార్యక్రమం ఆరేళ్ల క్రితం ఆగిపోయింది. అప్పటినుంచి వయోజనులకు అక్షరాలు నేర్పించే కార్యక్రమం అటకెక్కింది. అయితే నవభారత సాక్షరత ద్వారా నిరక్షరాసులైన వయోజనులందరినీ వచ్చే అయిదేళ్లలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 15 ఏళ్లు పై బడిన నిరక్షరాస్యులను లక్ష్యంగా పెట్టుకొని అయిదు దశల్లో వారికి శిక్షణ ఇచ్చి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు నైపుణ్యంతో స్వయం ఉపాధి పొందే శక్తిమంతులుగా మార్చడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ పథకాన్ని విజయంవంతం చేసేందుకు కేంద్ర 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించనున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లాలో ఈ పథకం ప్రారంభం కానుంది.

వలంటీర్ల భాగస్వామ్యంతో..

స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వలంటీర్లతో సాయంత్రం వేళలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. దీనిని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తారు. స్థానిక భాషల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన యువత, పొదుపు సంఘాల మహిళలు, ఉన్నత విద్యావంతులను ప్రేరేపించి వలంటీర్లుగా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యక్రమాన్ని బలోపేతం చేయనున్నారు. ముందుగా ఎక్కువ మొత్తంలో నిరక్షరాస్యులు ఉన్న గ్రామాలను గుర్తించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

మాయమాటలు నమ్మితే ఆగమే..

మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

పటాన్‌చెరు టౌన్: బీజేపీ, బీఆర్‌ఎస్ మాయ మాటలు నమ్మితే.. బతుకులు ఆగమవుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఎన్నికల ప్రచారంలో భాగంగా అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట దుర్గమ్మ గుడి సమీపంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో ఆమె పాల్గొని మాట్లాడారు... ఎన్నికలు రావడంతో కేసీఆర్ బయటకు వచ్చి టీవీలలో ఇంటర్వ్యూలు, యాత్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఆలోచన చేసి నీలం మధును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీకి తొత్తుగా కేసీఆర్..

అనంతరం బీరంగూడ కమాన్ నుండి బీరంగూడ గుట్ట వరకు సాగిన రోడ్ షోలో పీసీసీ జనరల్ సెక్రెటరీ అద్దంకి దయాకర్ పాల్గొని మాట్లాడారు. బీజేపీకి తొత్తుగా మారిన కేసీఆర్ కారును వదిలిపెట్టి బస్సు యాత్రను చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కమలం బీఆర్‌ఎస్ ఒకటి కాదా...? అని ఈ సందర్భంగా ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవ్వాలంటే.. బలహీనవర్గాల బిడ్డ నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంటుకు పంపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

పోలింగ్‌ కేంద్రాలు పరిశీలన



పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామేశ్వర్‌ సింగ్‌

మెదక్‌ మున్సిపాలిటీ: పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం జిల్లా పోలీస్‌ అబ్జర్వర్‌ డాక్టర్‌ రామేశ్వర్‌ సింగ్‌ జిల్లాలోని ఎన్నికల పోలింగ్‌ కేంద్రాలను సందర్శించారు. అక్కడికి పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ఎన్నికలను ప్రభావితం చేసే ఎలాంటి అనుమానాస్పద అంశాలు కనిపించినా క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.

అనుచిత పోస్టింగ్‌లు పెడితే చర్యలు

ఎస్పీ బాలస్వామి



మెదక్‌ మున్సిపాలిటీ: ఎవరైనా ఇతర వ్యక్తులను, రాజకీయ పార్టీలను ఉద్దేశించి సోషల్‌ మీడియాలో అనుచితమైన వాఖ్యలు, అనుచిత పోస్టింగ్‌లు పెడితే ఎలక్ట్రానిక్‌ డివైజ్‌ లు సీజ్‌ చేసి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఎస్పీ బాలస్వామి హెచ్చరించారు. ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ.. పార్లమెంట్‌ ఎన్నికల నిర్వహణ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నియమావళిని జిల్లా యంత్రాంగం పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. సోషల్‌ మీడియాపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున పౌరులు బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, పోలీసు శాఖ అధ్వర్యంలో సోషల్‌ మీడియా మానిటరింగ్‌ సెంటర్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

సివిల్‌ సర్వీసెస్‌ 639వ ర్యాంకర్‌ అర్పిత



మాట్లాడుతున్న అర్పిత

తూప్రాన్‌: తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇండియన్‌ సివిల్‌ సర్వీసెస్‌లో 639వ ర్యాంకు సాధించానని ర్యాంకర్‌ అర్పిత అన్నారు. ఆదివారం మండలంలోని నర్సంపల్లి గ్రామంలో గ్రామస్తులు, కుల సంఘం నాయకులు, తోటి పూర్వపు విద్యార్థులు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్పిత ఖోల మాట్లాడుతూ.. తాను గిరిజన కుటుంబంలో జన్మించి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి సివిల్‌ సర్వీసెస్‌లో 639వ ర్యాంకర్‌ సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తాజా సర్పంచ్‌ సత్యనారాయణ, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ ఇచ్చి వస్తానని వెళ్లి..

సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: ల్యాప్‌టాప్‌ ఇచ్చి వస్తానని వెళ్లి సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌ పరిధిలోని సాయి అంబికా కాలనీకి చెందిన మౌనిక(29) హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం స్నేహితురాలికి ల్యాప్‌టాప్‌ ఇచ్చి వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృష్టంపై తండ్రి నర్సింహారాజు శనివారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డీడీలు కట్టరు.. చక్కెర ఇవ్వరు

- అంత్యోదయ కార్డుదారులకు అందని పంచదార
- రెండేళ్లుగా నిలిచిపోయిన వైనం
- ప్రభుత్వ ఉత్తర్వులు పక్కకు..
- కార్డుదారులతో పేచీలంటూ డీడీలు చెల్లించని డీలర్లు
- కిరాణ దుకాణాల్లో కొంటున్న లబ్ధిదారులు



రేషన్‌ దుకాణంలో సరుకులను తీసుకుంటున్న లబ్ధిదారులు

సిద్దిపేటరూరల్‌: అంత్యోదయ కార్డు దారులకు రేషన్‌ షాపుల ద్వారా ప్రతినెలా ఉచితంగా పంపిణీ చేయాల్సిన చక్కెర అందడం లేదు. ఈ కార్డు దారులకు సబ్సిడీతో చక్కెర అందించాలని ఉత్తర్వులు ఎప్పటి నుంచో ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు కాక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రేషన్‌ డీలర్లు పంచదార కోసం డీడీలు చెల్లించకపోవడంతో రెండేళ్లుగా రేషన్‌ దుకాణాల్లో పంచదార సరఫరా నిలిచిపోయింది. దీంతో అధిక ధరకు బయట దుకాణాల్లో కొనుగోలు చేసి ఇబ్బంది పడుతున్నారు.

18,378 అంత్యోదయ కార్డులు

జిల్లా వ్యాప్తంగా 2,91,402 పైగా రేషన్‌ కార్డులు ఉన్నప్పటికీ, 18,378 అంత్యోదయ అన్నయోజన కార్డులు అన్న వారికి మాత్రమే సబ్సిడీ చెక్కర లబ్ధి జరగనుంది. జిల్లా మొత్తం చక్కెర పంపిణీ చేసేందుకు నెలవారీగా 18 టన్నుల మేర అవసరం ఉంటుంది. ప్రధానంగా అంత్యోదయ కార్డుదారులకు మాత్రమే ఈ చక్కెర పంపిణీ చేస్తుండడంతో తెల్లరేషన్‌ కార్డు దారుల నుంచి సమస్యలు వస్తున్నాయన్న సాకుతో రేషన్‌ డీలర్లు డీడీలు చెల్లించడం లేదని తెలుస్తోంది. సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం దృష్టి సారించని నేపథ్యంలో రాయితీపై ఇచ్చే చక్కెర పంపిణీ అటకెక్కినట్లైంది. రేషన్‌ దుకాణాల్లో ఇతర నిత్యావసర సరుకులు తీసుకెళ్లేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఒక్క బియ్యాన్ని

కిలో రూ.45 పైమాటే..

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పంచదార కిలో రూ.45 నుంచి రూ.48 వరకు ఉంది. ఈ ధర పేద ప్రజలకు భారంగా మారుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం వారిని అదుకునేందుకుగాను ఉచిత బియ్యంతో పాటు కిలో పంచదారను సబ్సిడీపై అంత్యోదయ అన్నపూర్ణ యోజన కార్డుదారులకు అందించాలని ఆదేశించింది. రెండేళ్లు అవుతున్నా ఉత్తర్వులు అమలు కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

పంచదార స్టాక్‌ ఉన్నా..

మాత్రమే డీలర్లు పంపిణీ చేస్తున్నారు. పౌర సరఫరాల శాఖ వద్ద పంచదార స్టాక్‌ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ డీలర్లు డీడీలు కట్టని కారణంగానే పంచదార కేటాయింపులు జరగడం లేదని అధికారులు జవాబిస్తున్నారు. జిల్లాలో పంచదార పంపిణీపై అవగాహన కల్పించి అంత్యోదయ అన్న యోజన కార్డుదారులకు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. లేదంటే అన్ని కార్డుల లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



అంత్యోదయ కార్డుదారులకు రాయితీతో కూడిన కిలో చక్కెర అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు లబ్ధిదారులకు చక్కెర అందేలా చర్యలు తీసుకుంటున్నాం. మే నెలలో బియ్యంతోపాటు పంచదార కోసం డీలర్ల నుంచి డీడీలు తీసుకుంటాం. లబ్ధిదారులకు సరిపడా పంచదార అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తాం.

– హరీశ్‌, సివిల్‌ సప్లయ్‌ జిల్లా మేనేజర్‌

రాజ్యాంగంపై దుష్ప్రచారం

- కేసీఆర్‌, రేవంత్‌రెడ్డిలు అవిభక్త కవలలు
- మెదక్‌ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్‌జోన్‌: రాజ్యాంగాన్ని మారుస్తారంటూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలపై సర్జికల్‌ స్ట్రైక్‌ జరుగుతుందంటూ రెండు రోజులుగా బీజేపీపై ఉద్దేశ్య పూర్వకంగా సీఎం రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నాడని మెదక్‌ బీజేపీ పార్లమెంట్‌ అభ్యర్థి రఘునందన్‌రావు మండిపడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రాజ్యాంగ సవరణ జరుగుతుంది తప్ప దానిని మార్చడం సాధ్యం కాదని మోదీ చాలా సార్లు స్పష్టం చేశారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం మొదటి సారి ఎప్పుడు సవరణ జరిగిందో సీఎం రేవంత్‌రెడ్డికి తెలుసా అని ప్రశ్నించాడు. రాజ్యాంగ సవరణ విషయంలో నేను చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పెట్టాలను కుంటున్నారా? పత్రికా స్వేచ్ఛను హరించాలనుకుంటున్నారా..? ప్రతి పక్షాలను జైళ్లో పెట్టాలను కుంటున్నారో చెప్పాలన్నారు. జై శ్రీరామ్‌ అంటే కడుపు నిండుతదా అంటూ కేటీఆర్‌ మాట్లాడుతున్నాడని, అల్లాహు అక్బర్‌ అంటే కడుపు నిండుతుందా..? కేటీఆర్‌ చెప్పాలన్నారు. జై తెలంగాణ అంటూ ప్రాణత్యాగం చేసిన శ్రీకాంత్‌ చారి కుటుంబాన్ని ఎందుకు గౌరవించలేదని ప్రశ్నించాడు. బరాబర్‌ జై శ్రీరామ్‌ అంటాం, కేసీఆర్‌ను బొంద పడుతాం అన్నారు. కేసీఆర్‌ నూరు అబద్ధాలు ఆడితే రేవంత్‌రెడ్డి వెయ్యి అబద్ధాలు ఆడుతున్నాడన్నారు. కేసీఆర్‌, రేవంత్‌రెడ్డిలు అవిభక్త పిల్లలన్నారు. జీవో 51 ద్వారా తెలంగాణలోకి సీబీఐ రావద్దని కేసీఆర్‌ రాష్ట్ర క్యాబినెట్‌లో ఆమోదం తెలిపారని, ఆ జీవోను రేవంత్‌రెడ్డి రద్దు చేసి కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గడ్డం శ్రీనివాస్‌, మురళీ యాదవ్‌, సంగమేశ్వర, శ్రీనివాస్‌, మధు, శివ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



శ్రీనివాస్‌(ఫైల్‌)

వెల్దుర్తి(తూప్రాన్‌): ప్రమాదవశాత్తు బైక్‌తోపాటు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మాసాయిపేట మండలం హకింపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, వెల్దుర్తి ఎస్‌ఐ నవతగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లొడబోయిన శ్రీనివాస్‌ (55) వ్యవసాయం చేస్తున్నాడు. గ్రామ శివారులో బండ మీద తమ ధాన్యం ఆరబోసి శుక్రవారం సాయంత్రం ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ట్రాక్టర్‌లో తరలిస్తున్నాడు. మొదటి ట్రిప్‌లో ఐకేపీ కేంద్రానికి వెళ్లి.. రెండో ట్రిప్‌కు మళ్లీ బండ వద్దకు రాలేదు. అదే రోజు రాత్రి తన ఎక్సెల్‌పై మండలంలోని ఎం.జలాల్‌పూర్‌లో బంధువుల ఇంటికి వెళ్లాడేమో అని కుటుంబ సభ్యులు భావించారు. శనివారం బంధువులకు ఫోన్‌ చేయగా ఇక్కడికి రాలేదని చెప్పారు. వెంటనే చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతకగా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గ్రామ శివారులోని చెరువులో ఒక మృతదేహం తేలి ఉండడాన్ని గమనించిన స్థానికులు బాధితులకు సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి మృతదేహం శ్రీనివాస్‌దిగా గుర్తించారు. శుక్రవారం సాయంత్రం వడ్లు తరలించే క్రమంలో బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ నవతగౌడ్‌ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

మద్యానికి బానిసై ఒకరు, ఉరి వేసుకొని మరొకరు



కుమార్‌(ఫైల్‌)

శివ్వంపేట(నర్సాపూర్‌): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి గుండ్లపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన డప్పు కుమార్‌(35) కొన్నేళ్ల నుంచి మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా తిరుగుతున్నాడు. తాగుడు వద్దన్న కుటుంబ సభ్యులతో పలుమార్లు గొడవ పడ్డాడు. మూడు రోజుల కిందట తాగుడు మానేయాలని భార్య చెప్పడంతో ఆమెతో గొడవ పడగా పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యానికి బానిసై అప్పులు పెరగడంతో ఆదివారం తెల్లవారు జామున ఇంట్లో కుమార్‌ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

ఉరేసుకొని యువకుడు..



రాకేశ్‌ (ఫైల్‌)

అక్కన్నపేట(హుస్నాబాద్‌): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్కన్నపేట మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చౌటపల్లి గ్రామానికి చెందిన ఎర్రవెల్లి రాకేశ్‌ (25) కరీంనగర్‌ జిల్లా ప్రతిమ ఆస్పత్రిలో ప్లంబింగ్‌ వర్కర్‌గా పని చేసుకుంటూ అక్కడే అద్దెకు ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అతను ఉంటున్న అద్దె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇతడికి వివాహం కాలేదు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.



సమావేశంలో పాల్గొన్న సిద్దిపేట యువకవులు (ఫైల్‌)

యువ కవుల జోష్‌..

యువతరంతో జిల్లాకు కొత్త శోభ ● వెల్లివిరిసిన సాహిత్య సంపద

పురాతనం నుంచి కవులకు పెట్టింది పేరు 'సిద్దిపేట'

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జిల్లాలో కవులు, కళాకారులు, సాహితీవేత్తలతో ఆధ్యాత్మికం, సాహిత్యం పరంగా సిద్దిపేట ముందుకెళ్తుంది. సిద్దిపేట జిల్లాలో పురాతన కాలం నుంచి నేటి వరకు కవులు, రచయితలతో నిండుకుండాల సాహితీ సంపద విరజిల్లుతూనే ఉంది. దీనికి నిదర్శనం నేటికి జిల్లాలో ప్రతి దినం కవులు తమ ప్రచురణలను ప్రచురించడమే. పురాతనం నుంచి సిద్దిపేట కవులకు పెట్టింది పేరు. ఇక్కడ అనేక మంది పేరు గాంచిన కవులు తమ కవిత్వాల ద్వార ప్రజల్లో చైతన్యంతోపాటు వారి జీవన విధానంలో మార్పు తెస్తున్నారు. జిల్లాలోని యువ కవులు మేము కవిత్వంలో, రచనల్లో సాహిత్యంలో తక్కువేం కాదు అన్నట్లుగా తమ వాణి, బాణిని బాగానే వినిపిస్తున్నారు. దీంతో సిద్దిపేట పాతతరం, కొత్తతరం కవులు రచయితలతో నిండు సాహిత్యంతో కిటకిటలాడుతుంది. ముఖ్యంగా నేటి తరం యువతలో సాహిత్యంపై మక్కువ లేకున్నా పట్టణంలో ఉన్న యువ కవులు తమ కవిత్వాలతో, రచనలతో యువతరానికి సాహిత్యం అంటే ఎంతో రుచి చూపిస్తూ అందరూ సాహిత్యం వైపునకు చూసేలా చేస్తున్నారు. ఏ సమావేశం, సభలు నిర్వహించినా అక్కడ సిద్దిపేట పట్టణానికి చెందిన యువ కవులు, యువ రచయితలు వాఖ్యాతగా వ్యవహరించాల్సిందే.

కవుల నిలయం సిద్దిపేట



సిద్దిపేటలో మొదటి నుంచి సాహితీ వాతావరణం బాగానే ఉంటుంది. అందువల్ల అనేక మంది యువ కవులు తమ కవిత్వాలు, రచనలతో ముందుకు సాగుతున్నారు. రానున్న తరంలో కూడా కవులకు నిలయంగానే మారనుంది. నేను అనేక కవిత్వాలు, రచనలు చేశాను. అనేక పుస్తకాలు ముద్రించాను. జిల్లాలో నూతనంగా అనేక మంది యువకులు కవిత్వం, రచనల వైపునకు రావడం సంతోషంగా ఉంది.

–ఉండ్రాళ్ల రాజేశం, యువకవి

పెద్దలు చూపిన మార్గంలో..



మన వారసత్వంతో కవిత్వం అనేది వస్తుంది. దీంతో పాటుగా సిద్దిపేటలో అనేక మంది కవులు ఉండటం వల్ల వారిని అనుసరించి, వారు చూపిన బాటలోనే కవితలు రాయడం చేస్తున్నాం. దీంతో సిద్దిపేటలో అనేక మంది యువకవులు తమ కవిత, రచనలను ఇక్కడి వారికి అందించటంలో మాలాంటి యువ కవులు తమ వంతుగా కృషి చేస్తున్నాం. నేను బడి గంటలు అనే కవితా సంపుటిని వెలువరించాను.

–గంగాపురం శ్రీనివాస్‌, యువకవి

స్వీయ రచనలతో..



స్వీయ రచనలతో ముందుకు సాగుతున్నాం. ముఖ్యంగా సమాజంలో జరుగుతున్నవి కవితలుగా, రచనలుగా సిద్దిపేట ప్రజలకు సాహిత్యం అందించడం జరుగుతుంది. నేను ముఖ్యంగా చిన్నారులను, యువకులను ఉత్సాహ పరిచేలా కవితలు చేస్తుంటాను. చిన్నారులను కవిత్వం, రచనల వైపునకు వచ్చే విధంగా కృషి చేస్తున్నాం. ఈ విధంగా యువకవులం ఒకరికి ఒకరం ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగుతున్నాం.

–బైతి దుర్గయ్య, యువకవి

రెండేళ్ల చిన్నారిని చిదిమేసిన లారీ

- ఆడుకుంటూ జాతీయ రహదారి దాటిన బాలుడు
- తండ్రి తీసుకొస్తుండగా ఒక్కసారిగా రోడ్డుపైకి..
- లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి
- కౌడిపల్లి మండలం వెంకట్రావుపేటలో ప్రమాదం



ప్రణయ్‌ మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్‌): ఇంటి ఎదుట ఆడుకుంటూ పిల్లలు రోడ్డు దాటారు. ఇది గమనించిన తండ్రి పిల్లలను తీసుకొస్తున్నాడు. ఇంతలోనే చిన్న బాలుడు రహదారిపై ముందుకు రాగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన ఆదివారం రాత్రి మెదక్‌ జిల్లా కౌడిపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన దొంతుల రాములు, స్వప్న దంపతులకు కుమారుడు ప్రణయ్‌(2), కూతురు ఉన్నారు. వెంకట్రావ్‌పేట గేట్‌ జాతీయ రహదారి పక్కనే వీరి ఇళ్లు ఉంది. ప్రణయ్‌, మరో అమ్మాయి ఇంటి ఎదుట ఆడుకుంటూ 765డి జాతీయ రహదారిపైకి వచ్చి రోడ్డు దాటారు. ఇంతలో తండ్రి రాములు గమనించి రోడ్డుపైకి వచ్చి పిల్లలను తీసుకొని రోడ్డు దాటుతున్నాడు. కొడుకు ప్రణయ్‌ తండ్రి చేయి వదిలి ఒక్కసారిగా ముందుకొచ్చాడు. ఇదే సమయంలో నర్సాపూర్‌ వైపు నుంచి మెదక్‌ వెళ్తున్న లారీ ప్రణయ్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి కళ్ల ఎదుటే అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కొడుకు చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదన వర్ణనాతీతంగా మారాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌ కుమార్‌రెడ్డి తెలిపారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకెళ్తున్నారు.

సర్వం కోల్పోయాం

- ఆదుకోవాలంటున్న బాధితులు
- షార్ట్‌ సర్క్యూట్‌తో ఇళ్లు, సామగ్రి దగ్ధం



కాలిపోయిన నగదు

అక్కన్నపేట(హుస్నాబాద్‌):విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ ప్రమాదంలో ఓ కుటుంబం సర్వసం కోల్పోయింది. శరీరంపై ఉన్న బట్టలు తప్ప ఏమీ మిగలలేదు. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామ పరిధిలోని తారా చంద్‌తండాకు చెందిన బట్టు రాజు ఇల్లు షార్ట్‌ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే. ఇంట్లోని నగదు, బట్టలు, బియ్యం కాలి బూడిదయ్యాయి. రాజు కుటుంబం కూలీనాలి చేసి జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రమాదంతో ఒక్కసారిగా రోడ్డుపై పడ్డారు. తండాకు చెందిన రైనా నాయక్‌, గ్రామస్తులు, యువకులు బాధిత కుటుంబానికి ఆదివారం బియ్యం, కూరగాయాలను అందించారు. వీరిని దాతలు ఆదుకోవాలని కోరుతున్నారు. అదే విధంగా ప్రభుత్వం సాయం చేయాలని విన్నవించారు.

● కొత్త బైకు పూజకెళ్లి..

అంతలోనే రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బాలరాజు(ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): కొత్త బైకు పూజ చేయించడానికి వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చేగుంట పట్టణానికి చెందిన న్యాలపల్లి బాలరాజు(50) అలియాస్‌ పేపర్‌ బాలరాజు ఇటీవల కొత్త బైకు తీసుకున్నాడు. ఆదివారం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ వద్ద బైక్‌కు పూజ చేయించడానికి వెళ్లాడు. పూజ అనంతరం బైక్‌ ట్రయల్‌ నడుపుతున్నాడు. గజ్వేల్‌ వైపు నుంచి వస్తున్న కారు బైకును ఢీకొట్టగా బాలరాజు కిందపడ్డాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కంటైనర్‌ బాలరాజు పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

● రెండు బైక్‌ ఢీ : ఒకరు మృతి

పాపన్నపేట(మెదక్‌): రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్‌ శివారులో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీ నగర్‌కు చెందిన పటాల శ్రీను (52) సాయంత్రం బైక్‌ పై కొత్తపల్లి వైపు వెళ్తున్నాడు. ఎదురుగా బైక్‌ పై వస్తున్న కొత్త పల్లి వాసి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనుకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

● గుర్తు తెలియని వాహనం ఢీకొని



రమేశ్‌ మృతదేహం

కోహీర్‌(జహీరాబాద్‌): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దిగ్వాల్‌ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రిష్ణయ్య కథనం మేరకు.. దిగ్వాల్‌ గ్రామానికి చెందిన బక్క రమేశ్‌(40) గ్రామ సమీపంలోని ఫిరమల్‌ పరిశ్రమంలో కూలి పని చేసుకొని జీవిస్తున్నాడు. శనివారం రాత్రి పరిశ్రమకు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై రమేశ్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుతన్నామని ఎస్సై క్రిష్ణయ్య తెలిపారు.

రాత్రివేళ మందుబాబుల వీరంగం

- వైన్స్‌ సిబ్బందిపై దాడి
- అడ్డుకున్న పోలీసులపై దాడికి యత్నం
- సిద్దిపేట జిల్లాలో ఘటన

తొగుట(దుబ్బాక): మద్యం షాపులో కావాల్సిన బ్రాండ్‌ దొరకలేదని మందుబాబులు దాడికి తెగబడ్డారు. అడ్డుకోబోయిన పోలీసులపైనా తిరగబడ్డారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో ఆదివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తొగుట మండలం ఘనపురంలో బొడ్రాయి పండగతో పాటు మహంకాళి అమ్మవారికి బోనాలు తీశారు. ఆదివారం ఊరంతా పండుగ చేసుకున్నారు. ఈ క్రమంలో కొందరు మెట్టు వద్ద ఉన్న వైన్‌ షాపునకు వెళ్లి బీర్లు కావాలని అడిగారు. వీరు అడిగిన బ్రాండు బీర్లు లేవంటూ షాపు సిబ్బంది తెలిపారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం జరిగింది. సహనం కోల్పోయిన మందుబాబులు దుకాణంలోకి చొరబడి సిబ్బందిపై దాడిచేసి స్కానర్లను ధ్వంసం చేశారు. విషయం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులపై దాడికి పాల్పడ్డారు. వెంటనే అదనపు పోలీసు బలగాలు అక్కడి చేరుకొని మందుబాబులను పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఇరువర్గాల పై కేసు నమోదు చేసినట్టు సమాచారం.



చిన్నశంకరంపేట(మెదక్‌): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఓ రైతన్న ఆరబెట్టిన వరిధాన్యాన్ని వానర సైన్యం దర్జాగా ఆరగిస్తూ కనిపించాయి. విందు భోజనం కోసం కూర్చున్నట్లుగా వరుసలో కూర్చొని మరీ తినడం 'సాక్షి' కెమెరా కంటపడింది.